## హరీశ్‌రావును కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



లింగంపేట(తాడ్వాయి), అక్టోబర్ 14 : హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును తాడ్వాయి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ముదాం నర్సింహులు సోమవారం కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు రాములు ఉన్నారు.

## బీసీ నుంచి ఎస్టీ జాబితాలో కలపాలి



పొన్నం ప్రభాకర్‌తో నాయకులు

గాంధారి, అక్టోబర్ 14 : లభాన్ లంబాడీలను బీసీ నుంచి ఎస్టీ జాబితాలో కలపాలని కోరుతూ గాంధారి మండలానికి చెందిన లబాన్ సమాజ్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కలిశారు. మంత్రిని కలిసిన వారిలో లభాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్, నాయకులు దశరథ్‌నాయక్, చందానాయక్ తదితరులు ఉన్నారు.

## గౌతమ బుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన

మద్నూర్, అక్టోబర్ 14 : మండలకేంద్రంలో గౌతమబుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. 13 లక్షల రూపాయలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బౌద్ధ మతపెద్దలు, నాయకులు సాయిపటేల్, హన్మాండ్లు స్వామి, ప్రజ్ఞకుమార్, సాయిలు, రాంపటేల్, విఠల్‌గురుజీ, సాహెబ్‌రావు, వట్నాల రమేశ్, అమూల్, సచిన్, గోపి, తుకారాం, జావేద్‌పటేల్, బాలు, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## సోయా కొనుగోలు కేంద్రం పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్, అక్టోబర్14: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. యార్డులో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అంతకముందు గ్రామ మాజీ సర్పంచ్ వేద్‌ప్రకాశ్‌పటేల్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకు న్నారు.

# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 49 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 14 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గతవారం వరకు 18,182 ఆర్జీలను వచ్చాయన్నారు. సంబంధిత అధికారులు 17,455 ఆర్జీలను పరిశీలించి చర్యలు తీసుకున్నారని తెలిపారు. మిగతా 727 ఆర్జీల్లో 533 పెండింగ్‌లో ఉన్నాయని, 194 దరఖాస్తులను ఆయా శాఖలకు బదిలీ చేశారని తెలిపారు. 49 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



బాన్సువాడలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ/నస్రుల్లాబాద్, అక్టోబర్ 14 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించాలని, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ సూచించారు. బాన్సువాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాసులతో కలిసి పోచారం సోమ వారం ప్రారంభించారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను దళారులకు ఇచ్చి మోసపోవద్దని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగో లు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులు పండించిన సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 కొనుగోలు చేస్తుంద న్నారు. రైతులు ధాన్యం లో పొల్లు లేకుండా, తేమ శాతం 17 లోపు ఉండేలా చూసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, డాక్టర్ అంజిరెడ్డి, నాగుల గామ వెంకన్న గుప్తా, మాసాని రవీందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ నార్ల సురేశ్ గుప్తా, ఖాలెక్, ఎజాస్, మధుసూదన్‌రెడ్డి, రవీందర్ గుప్తా, సాయిలు యాదవ్ తదితరులు ఉన్నారు.

**నస్రుల్లాబాద్‌లో..**

నస్రుల్లాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.కోటి 43 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి, రూ.7లక్షలతో విజయకృష్ణ కాలనీలో సీసీ రోడ్డు, రూ.12 లక్షలతో మండల సమీకృత భవన సముదాయం ఆవరణలో సీసీ రోడ్డుకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మాజీద్, నాయకులు ప్రతాప్ సింగ్, రాము, మల్లేశ్, మైశాగౌడ్, ఖలీల్, శ్యామల, ఇక్బాల్, యూసూఫ్ ఉన్నారు.

**రాజంపేట్‌లో..**

రాజంపేట్, అక్టోబర్ 14 : రాజంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్ ప్రారంభించారు. సొసైటీ వైస్ చైర్మన్ రమేశ్, డైరెక్టర్లు సుధాకర్ రెడ్డి, బాలయ్య, బాగయ్య, సాయిబాబా, నర్సవ్వ, మండల వ్యవసాయాధికారిణి సునీతారాణి, విస్తరణాధికారిణి శిల్ప, మానిటరింగ్ అధికారి మసిమొద్దీన్, సీఈవో వెంకటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి

కామారెడ్డి, అక్టోబర్ 14 : డీఎస్సీ 2024 అపాయిమెంట్ ఉత్తర్వులు పొందిన, ఎంపికైన అభ్యర్థులు మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్ వద్ద కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లాంగ్వేజ్ పండిట్స్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ టీచర్లు, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎస్జీటీ తెలుగు, ఉర్దూ, మరాఠీ, స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. నిర్ణీత సమయంలో హాజరు కాని అభ్యర్థులకు మిగిలిపోయిన ఖాళీల్లో పోస్టింగ్‌లు ఇవ్వబడతాయని తెలిపారు. దానికి వారే బాధ్యత వహించాల్సిన ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో తదుపరి ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం ఉండదని తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ నియామక పత్రాలతోపాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని సూచించారు.

## యువకుల నిరసన

భిక్కనూరు, అక్టోబర్ 14 : మండల కేంద్రంలో జిల్లా సమాచార హక్కు చట్టం ప్రతినిధి గంగళ రవీందర్ బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ పలు చోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు వ్యక్తులు చింపివేశారు. దీనిని నిరసిస్తూ కొంత మంది యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. కావాలనే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలను చింపివేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

## గుండెపోటుతో ఒకరు మృతి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 14 : చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తికి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందిన ఘటన లక్ష్మాపూర్‌లో చోటుచేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ముదాం బాల్‌రాజ్(55) ముదిరాజ్ చేపలు పట్టుకొని జీవించేవాడు. ఆదివారం సాయం త్రం తన సహచరులతో కలిసి గ్రామ శివారులో ఉన్న కొట్టాల్ కొత్తచెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో దవాఖానకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఇతనికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య ముదాం కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

లింగంపేట, అక్టోబర్ 14 : లింగంపేట మండలం మోతె గ్రామానికి చెందిన గాధం ప్రణీత్ (22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం మృతుని తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్కారు దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

**జీవితంపై విరక్తితో మహిళ..**

బిచ్కుంద, అక్టోబర్ 14 : మండలంలోని వాజిద్‌నగర్ గ్రామంలో ఓ మహిళ జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై మోహన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వాజిద్‌నగర్ గ్రామానికి చెందిన సుమలత(36) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నంది. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 14: బాధిత కుటుంబ సభ్యులకు ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన ఒట్లెం గంగారాం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ సాయిలు, భాస్కర్, రాజయ్య, భూషణం, అంజయ్య, వెంకట్‌రాములు, శంకర్, ప్రకాశ్, రమేశ్, సాయి తదితరులున్నారు.

**అంత్యక్రియలకు..**

భిక్కనూరు, అక్టోబర్ 14 : మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన సిద్దయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియల కోసం మాజీ సర్పంచ్ గుడిసే రాములు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ యాదగిరి, గ్రామ పెద్దలు సత్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్, సిద్ధరాంలు తదితరులు ఉన్నారు.

## ఘనంగా దుర్గామాత శోభాయాత్ర

ఎల్లారెడ్డి రూరల్/నాగిరెడ్డిపేట/రామారెడ్డి/గాంధారి/భిక్కనూరు, అక్టోబర్ 14: శరన్నవరాత్రులు ముగిసిన సందర్భంగా గంగమ్మ చెంతకు గౌరమ్మ చేరింది. ఎల్లారెడ్డి పట్టణంలో నెలకొల్పిన దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర ఆదివారం రాత్రి ప్రారంభమైంది. సోమవారం ఉదయం 4 గంటల వరకు స్థానిక పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా మున్సిపల్ అధికారులు క్రేన్‌ను, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. శరన్నవరాత్రుల సందర్భంగా నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా ముగిసింది.

**అమ్మవారి చీరలకు రూ.1.80 లక్షలు..**

నాగిరెడ్డిపేట మండలంలోని కిచ్చన్నపేట లో దుర్గామాత శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. శ్రీవేంకటేశ్వర కల్యాణం సందర్భంగా అమ్మవారికి బహూకరించిన చీరలను వేలం వేయగా గ్రామానికి చెందిన తలకొక్కుల రమేశ్, దుర్గం రాజులు రూ.50 వేలకు దక్కించు కున్నారు. చీరలను వేలం వేయగా.. రూ.1.30 లక్షలు వచ్చినట్లు దుర్గామాత కమిటీ సభ్యులు తెలిపారు. నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గామాత లడ్డూను వేలం వేయగా రూ.11,500 గ్రామానికి చెందిన బేస్త కిష్టయ్య దక్కించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసిన చీరలను రూ.100 చొప్పున మహిళా భక్తులకు అందించినట్లు మండలి ప్రముఖుడు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. రామారెడ్డిలో గాంధీయూత్ సభ్యులు దుర్గామాతను నిమజ్జనం చేశారు. అమ్మవారికి అలంకరించిన వివిధ రకాల చీరలను వేలం వేయగా రూ.లక్షా 78 వేలు వచ్చినట్లు యూత్ సభ్యులు తెలిపారు. గాంధారిలోని రాందశ్ యూత్ సభ్యులు అమ్మవారి లడ్డూను రూ.41,111 దక్కించుకున్నారు. ఆ లడ్డూను గ్రామంలో వితరణ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు ఆకుల మహేశ్, హరీశ్, సాయి, గంగాధర్ తదితరులు ఉన్నారు. గాంధారిలోని శ్రీరాంనగర్ కాలనీలో స్వేచ్ఛ హిందూవాహిని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహానికి భక్తులు సమర్పించిన ఒడి బియ్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భిక్కనూరు మండలం జంగంపల్లిలో దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## 'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, అక్టోబర్14: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి అనిల్ కుమార్ సూచించారు. వర్షా కాలంలో రైతులు సాగు చేసే పంటల సస్యరక్షణ చర్యలు, చీడ పీడల నివారణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆదర్శ రైతులు తమ అనుభవాలను వివరిస్తారన్నారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆన్‌లైన్‌లో సలహాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వివాహిత అదృశ్యం

కామారెడ్డి, అక్టోబర్ 14 : జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన కెంగర్ల నిర్మల అనే వివాహిత తప్పిపోయినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. కెంగర్ల నిర్మల తండ్రి కెంగర్ల మల్లయ్య వద్ద ఉంటుంది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదన్నారు. ఈ నెల 7న ఉదయం 8 గంటలకు పువ్వులు తీసుకొస్తానని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు. ఈమె ఆచూకీ తెలిస్తే కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో గాని, 8712686145, 8712666242 నంబర్లను తెలియజేయాలని సూచించారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలి

లింగంపేట, అక్టోబర్ 14 : మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకుడు గుండ బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శంకుస్థాపనలు చేసినట్లు గుర్తు చేశారు. ఈ పథకంలో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుతో విద్యార్థులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

## మోతె గ్రామంలో సర్వే

లింగంపేట, అక్టోబర్ 14 : లింగంపేట మండలం మోతె గ్రామంలో సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. వారం రోజుల క్రితం గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడానికి చదును చేస్తుండగా గ్రామానికి చెందిన మైనార్టీలు అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలం మైనార్టీల శ్మశాన వాటికకు కేటాయించిన స్థలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయవద్దని గ్రామస్తులకు సూచించడంతో చదును చేయడం నిలిపివేశారు. ఈ విషయమై మైనార్టీలు శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ నరేందర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం రెవెన్యూ అధికారులు 417, 542 నంబర్లలో ఉన్న భూమిని సర్వే నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్‌గౌడ్‌తోపాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కుప్పను ఢీ కొని ఇద్దరికి గాయాలు

నస్రుల్లాబాద్, అక్టోబర్ 14 : బీర్కూర్ మండలం కిష్టాపూర్ వద్ద ఆదివారం రాత్రి రోడ్డుపైన పోసిన ధాన్యం కుప్పను ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బీర్కూర్ గ్రామానికి చెందిన రాము, అశోక్ బైక్‌పై బాన్సువాడ నుంచి బీర్కూర్‌కు వస్తున్నారు. కిష్టాపూర్ వద్ద ధాన్యం కుప్పను ఢీ కొనడంతో రాము తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

**రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు**

లింగంపేట, అక్టోబర్ 14 : మండలంలోని కంచుమహల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గాంధారి మండలం వంద్రికల్ గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనంపై ముంబాజీపేట తండాకు వస్తున్న సమయంలో ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న ధరమ్‌సింగ్, గంగాబాయితోపాటు వారి ఇద్దరు పిల్లలకు గాయాలైనట్లు తెలిపారు.

## రాజంపేటలో వైద్యఆరోగ్యశాఖ విచారణ

రాజంపేట్, అక్టోబర్ 14 : మండల కేంద్రంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వైద్యారోగ్యశాఖ బృందం సందర్శించింది. రాజంపేటలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఇటీవల పట్టుబడిన బల్లరవి సోదరి ఆశ వర్కర్ రాజశ్రీకి లింగ నిర్ధారణ కేసులో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ సిబ్బంది విచారణ చేపట్టినట్లు మండల వైద్యాధికారిణి విజయ మహాలక్ష్మి తెలిపారు. ఆశ కార్యకర్తగా ఎన్ని రోజుల నుంచి పని చేస్తున్నది, లింగ నిర్ధారణ పరీక్షలకు ఆమెకు ఏమైనా సంబంధం ఉందా అనే విషయాల గురించి గ్రామంలో పలువురి నుంచి వివరాలు సేకరించినట్లు తెలిపారు.

# వీధి కుక్కల బెడదను నివారించాలని వినతి

భిక్కనూరు, అక్టోబర్ 14 : మండల కేంద్రంలో వీధికుక్కలు, కోతుల బెడదను నివారించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు మాట్లాడుతూ.. భిక్కనూర్‌లోని గాంధీ చౌరస్తాలో చికెన్ సెంటర్ యజమానిపై సోమవారం వీధి కుక్క దాడి చేసిందన్నారు. అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖాకు తరలించగా మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. నిత్యం వీధికుక్కలు, కోతులు చిన్న పిల్లలు, వృద్ధులను గాయపరుస్తున్నాయన్నారు. వాటిని జనావాసాలకు దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

## వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 14 : మండలంలోని బోధన్-హైదరాబాద్ రహదారిపై రాఘవపల్లి తండా వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని రామక్కపల్లి గ్రామానికి చెందిన జోడు సాయిలు(42) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నాగిరెడ్డిపేట మండలం రామక్కపల్లి గ్రామానికి చెందిన జోగు సాయిలు తన ద్విచక్ర వాహనంపై నాగిరెడ్డిపేటలో వార సంతకు వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా.. రాఘవపల్లి తండా సమీపంలో బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొట్టి వెళ్లిపోయినట్లు తెలిపారు. దీంతో అక్కడే ఉన్న తండావాసులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. చికిత్సల నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య పెంటవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనపై ఎస్సై మల్లారెడ్డిని సంప్రదించగా.. తమకు ఫిర్యాదు రాలేదని ఆయన చెప్పారు.

# విద్యుత్‌షాక్‌తో కాలిపోయిన ఫర్నిచర్

కామారెడ్డి, అక్టోబర్ 14 : జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో 15వ వార్డులో ఆదివారం రాత్రి విద్యుత్ షాక్‌తో ఫర్నిచర్, ఇంటిలోని సామాన్లు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 15వ వార్డులో షబానా అనే మహిళ ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లింది. ఇంటి పక్కన ఉండే వ్యక్తి బాత్‌రూమ్ కోసం రాత్రి బయటికి వచ్చాడు. ఇంటిలో నుంచి పొగలు రావడంతో యజమానికి ఫోన్ చేశాడు. వెంటనే షబానా కామారెడ్డిలోని తన ఇంటికి వచ్చే సరికి ఏసీ, ఫ్రిడ్జ్, సీసీ కెమెరాలు, సోఫాలు ఇతర విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, స్థానిక కౌన్సిలర్ వనిత రాంమోహన్ ఇంటిని పరిశీలించి అధికారులతో మాట్లాడి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

# ఒకే రోజు మూడు కాలాలు..

- ఉదయం ఎండా, మధ్యాహ్నం వాన, రాత్రి చలి
- ఇలాంటి పరిస్థితులు చూడలేమంటున్న ప్రజలు



గోపాల్‌పేటలో మధ్యాహ్నం ఎండతోపాటు కురుస్తున్న వర్షం

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 14 : గతంలో ఎప్పుడూ చూడని వాతావరణ పరిస్థితులను నాలుగు రోజులుగా మండల ప్రజలు చూస్తున్నారు. మండలంలో నాలుగు రోజులుగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతో ఉక్కపోత, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఝల్లులుగా వర్షం పడతున్నది. రాత్రి వేళ చల్లని గాలులతోపాటు చలి వేస్తుంది. దీంతో మండల ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. తాము ఇలాంటి వాతావరణ పరిస్థితులను గతంలో ఎప్పుడూ చూడలేమని వయోవృద్ధులు చెబుతున్నారు. వాతావరణంలో వచ్చే మార్పులతో ఇలా జరుగుతుందని కొందరు విద్యావంతులు చెబుతున్నారు. ఏదేమైనప్పటికీ నాలుగు రోజులుగా వాతావరణం వింతలు చూస్తున్న ప్రజలు ఆందోళన, ఆశ్చర్యానికి గురవుతున్నారు.

## నేడు శబరీ మాత వార్షికోత్సవం

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 14 : మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో సద్గురు శబరీమాత ఆశ్రమంలో మంగళవారం వార్షికోత్సవం ఏర్పాటు చేసినట్లు శబరీమాత భక్త మండలి సభ్యుడు దుర్గయ్య తెలిపారు. ఉదయం అమ్మవారి పల్లకీ సేవా ఊరేగింపు, పాదుక పూజ ఉంటుందన్నారు. అనంతరం అమ్మవారి నామస్మరణతో సంకీర్తన, భజన, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలోని మాత భక్తు లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SHAIK AMZAD S/o. SHAIK ZAKIR HUSSAIN, R/o. H.No.2-61/1, Pochamma galli, Vill. & Mdl: Nasurullabad, Dist.Kamareddy, Telangana State I State that in my education certificate /Memos/ Aadhar Card/ Pan Card my father name was wrong Mentioned as SHAIK MOWLANA instead of SHAIK ZAKIR HUSSAIN I have changed my Father Name from SHAIK MOWLANA (Old Name) to SHAIK ZAKIR HUSSAIN (New Name)

NTZ-334773

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, అక్టోబర్ 14 : సెట్విన్ టెక్నికల్ శిక్షణ ఇనిస్టిట్యూట్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ద్వారా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ టీటీఐ తెలంగాణ ప్రభుత్వ కో-ఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహిందీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉచిత స్టడీ మెటీరియల్‌తోపాటు కోర్సు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7386180456, 7989159121 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## గంగమ్మ వాగులో ధాన్యం లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రామారెడ్డి, అక్టోబర్ 14 : మండల కేంద్రంలో గంగమ్మవాగుపై ధాన్యం లారీ ఆదివారం అర్ధరాత్రి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ మండలం నుంచి కామారెడ్డికి ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీ వాగులో బోల్తా పడింది. వాగులో ధాన్యం సంచులు పడడంతో ఉదయం మరో లారీలోకి బస్తాలను లోడ్ చేశారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

## రేణుకాఎల్లమ్మ ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డి, అక్టోబర్ 14 : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసాని పేట శివారులో ఉన్న రేణుకాఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఆలయం తాళం పగుల గొట్టి హుండీలో ఉన్న నగదుతోపాటు బంగారు పుస్తెల తాడు, విలువైన వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. చోరీ జరిగిన విషయం పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో..

గాంధారి, అక్టోబర్ 14 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన గాంధారి మండలం జువ్వాడీ గ్రామంలో చోటు చేసుకున్నది. గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల పండరీ పది రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తలుపులు తెరచి ఉండడాన్ని గమనించారు. దుండగులు దాబాపై నుంచి ఇంట్లోకి దిగి బీరువాను పగులగొట్టి అందులోని పది తులాల వెండితోపాటు ఇత్తడి బిందెలు, రాగి వస్తువులను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు.

## కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

నిజాంసాగర్, అక్టోబర్ 14 : నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ నుంచి సోమవారం సాయంత్రానికి 2100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని ప్రాజెక్టు ఏఈఈ శివ ప్రసాద్ తెలిపారు. వరద గేట్లు మూసివేసినట్లు చెప్పారు.